క్లుప్తంగా

మిలీనియం చర్చి నిర్మాణానికి శంకుస్థాపన



దెందులూరులో మిలీనియం చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

దెందులూరు: దెందులూరు గొడవీధిలో సాల్వేషన్ ఆర్మీ మిలినియం లూథరన్ చర్చి నిర్మాణానికి శనివారం దెందులూరు కోర్ ఆఫీసర్ కే.రమణయ్య శంకుస్థాపన చేశారు. రెండు సెంట్ల స్థలాన్ని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత పల్లె యోహాను చంద్రహాస్ దంపతులు చర్చి నిర్మాణానికి దానం చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. ఆయన కుమారులు పల్లె గాంధీ, హర్షవర్ధన్ మాట్లాడుతూ తమ తండ్రి ఆధ్యాత్మిక చింతన కోసం చర్చి ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంతోపాటు ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలనే ఆశయంతో స్థలాన్ని దానం చేశారన్నారు. అనంతరం బత్తిన కుటుంబ సభ్యులు, సంఘస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భీమడోలు: సూరప్పగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన 33కేవీ వీసీబీ ఏర్పాటు, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 26వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఆపరేషన్లు ఈఈ జీపీబీ నటరాజన్ తెలిపారు. భీమడోలులో శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేసారు. మరమ్మతులు, నూతన వీసీబీ ఏర్పాటు వల్ల సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం, పాతూరు, అర్జావారిగూడెం, ఆగడాలలంక, గుండుగొలను, లక్ష్మీపురం, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు.

చేబ్రోలు రైల్వేగేట్ మూసివేత

ఉంగుటూరు: చేబ్రోలు రైల్వే గేటును శనివారం మూసివేశారు. మరమ్మతుల కారణంగా చేబ్రోలు రైల్వేగేటులో 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మూసి వేస్తున్నట్లు తహసీల్దారు వెంకటశివయ్య తెలిపారు. రైల్వే అధికార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. జంగారెడ్డిగూడెం -భీమవరం రూట్‌లో బస్సులు తిరిగేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కైకరం గేటు లేదా ఉంగుటూరు గేటు నుంచి బస్సులు నడపాల్సి వస్తుందని అధికారులు తెలిపారు.

31 నుంచి గంగానమ్మ సంబరాలు

ఏలూరు రూరల్ : శనివారపుపేట శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులో వెలసిన శ్రీగంగానమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం సంబరాలు ఈ నెల 31 తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ల మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. 31 ఉదయం 6.30 గంటలకు 108 బిందెలతో అమ్మవారికి అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు సామూహిక కుంకుమ పూజ చేయనున్నట్టు పేర్కొన్నారు. 1వ తేదీన విశేష పూజలు, భజన, 2న మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్న సమారాధన నిర్వహిస్తామని సభ్యులు గుత్తల ప్రసాద్, కొండపల్లి శ్రీనివాసు, శిరిగిబత్తిన శివనారాయణ పేర్కొన్నారు.

శ్రీవారి వస్త్రాల వేలం



శ్రీవారి ఆలయంలో వస్త్రాలు వేలం వేస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రీవారి వస్త్రాల వేలం ద్వారా రూ.86,210 ఆదాయం వచ్చింది. భక్తులు శ్రీవారికి సమర్పించిన పంచెలు, ఉభయ దేవేరులకు సమర్పించిన 103 చీరలు, 64 పంచెలకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముందూరు గ్రూప్ దేవస్థానాల కార్యనిర్వహణాధికారి పి.రాజబాబు పర్యవేక్షించారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

దెందులూరు: చల్లచింతలపూడి పంచాయతీ కంఠమనేనివారిగూడెంలో మైనర్ ఇరిగేషన్ శాఖలో ఎటువంటి అనుమతులు లేకుండా శనివారం అక్రమంగా మట్టి తవ్వకం చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, జోగన్నపాలెం వీఆర్వో రవికి ఫిర్యాదు చేశారు. వీఆర్వో రవి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వుతున్న ప్రాంతానికి శనివారం రాత్రి వెళ్లారు. అప్పటికే తవ్వకందారులు అక్కడి నుంచి వెళ్లిపోయారని ఆయన తెలిపారు. మట్టి తవ్వడం నిజమేనని వీఆర్వో రవి ధ్రువీకరించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వితే వాహనాలు సీజ్ చేస్తామని శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

4న కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- జేసీ, ఆర్వో లావణ్యవేణి
- రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలీసులతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి



దెందులూరు నియోజకవర్గ ఈవీఎంల సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి

దెందులూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు షెడ్యూల్ అనుగుణంగా వచ్చే నెల 4న కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. శనివారం దెందులూరు ఆర్వో కార్యాలయంలో డీఎస్పీ లక్ష్మయ్య, పెదవేగి సీఐ శ్రీనివాసకుమార్, దెదెందులూరు ఎస్సై స్వామి, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30లోపు ఏజెంట్లు మార్పులు, చేర్పులతో కూడిన జాబితాను అందజేయాలని సూచించామన్నారు. ఏజెంట్లను కౌంటింగ్ లోపలికి వెళ్లిన తరువాత నుంచి పూర్తయ్యే వరకు బయటకు పంపించడం కుదరదని అన్నారు. నియోజకవర్గంలో 237 పోలింగ్ స్టేషన్లకు 18 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందన్నారు. అసెంబ్లీకి, పార్లమెంట్‌కు 18 టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించనున్నట్టు తెలిపారు.1,851 పోస్టల్ బ్యాలెట్, 101 సర్వీసు ఓటర్లు మొత్తం 1,952 ఓట్లు ఆర్వో పర్యవేక్షణలో రెండు టేబుళ్లలో లెక్కిస్తామన్నారు. ఒక్కొక్క రాజకీయ పార్టీ 17 మంది ఏజెంట్లను నియమించుకోవచ్చని పేర్కొన్నారు. నియోజకవర్గానికి 10 వీవీ ప్యాడ్స్ కౌంటింగ్ చేయడం, ప్రతి రౌండ్‌కు ఫలితం అనంతరం మీడియా సెంటరుకు సమాచారం అందిస్తామన్నారు. ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు నేరచరిత్ర ఉన్న, ప్రభుత్వ గౌరవ వేతనం పొందుతున్నా, ప్రజాప్రతినిధులైనా, మాజీ ప్రజాప్రతినిధులైనా నియమించే అవకాశం లేదన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 4వ తేదీ సాయంత్రం కౌంటింగ్ పూర్తయిన తరువాత ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. పూర్తి సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎన్నికల కమిషన్ నిబంధనలు ఏ రాజకీయ పార్టీ అయినా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈవీఎంల భద్రత, పరిరక్షణ పరిశీలన

దెందులూరు: ఈవీఎంల, స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత, పర్యవేక్షణ నిరంతర ప్రక్రియ అని జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. శనివారం దెందులూరు నియోజకవర్గ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులతో ఆమె మాట్లాడారు. మూడంచెల భద్రతా వ్యవస్థ, స్ట్రాంగ్ రూమ్‌ను కాపాడుకునే, వాటి అమలు తీరును పోలీస్ ఉన్నతాధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు పర్యవేక్షణ కౌంటింగ్ ప్రక్రియ వరకు ఇది నిరంతర ప్రక్రియ అని ఆమె అన్నారు.

చిన్నారులకు విజ్ఞానం పెంపొందించేందుకే శిక్షణ



భీమడోలు గ్రంథాలయంలో నీతి కథలు చెబుతున్న విద్యార్థిని

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో శనివారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతులకు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. విద్యార్థులంతా సామూహిక పుస్తక పఠనం చేసారు. రిసోర్స్‌పర్సన్లు నీతి కథలు చెప్పారు. యోగాసనాలపై శిక్షణనిచ్చారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారే ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుంటారని పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ విద్యార్థులకు వివరించారు. సెల్‌ఫోన్లు విడచి పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకునేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి, పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కిజోఫ్రేనియా దీర్ఘకాలిక వ్యాధి



చేబ్రోలులో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ



పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సైకియాట్రిస్టు శ్రీనివాసరావు

ఉంగుటూరు: స్కిజోఫ్రేనియా అనేది దీర్ఘకాలిక వ్యాధి అని, దీనినే పిచ్చి, లేదా మతిభ్రమించడం అని అంటారని ప్రముఖ మానసిక సైకాలజిస్టు పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం చేబ్రోలు పీహెచ్‌సీలో ఎన్‌ఎంహెచ్‌ఈలో భాగంగా జిల్లా మెంటల్ హెల్త్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ మెదడులో ఉత్పత్తి కావాల్సిన డోపమైన్, సెరటోనిన్, గ్లూటామేట్ రసాయనాల అసమతుల్యం కారణంగా ఈవ్యాధి వస్తుందని అన్నారు. జన్యుపరంగా ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. తల్లితండ్రులకు ఈ వ్యాధి ఉంటే వారి సంతానానికి 7నుంచి 10శాతం వరకు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. మేనత్త మేనమామల వారసత్వం నుంచి 3నుంచి 5శాతం వచ్చే సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. స్త్రీ గర్భం దాల్చినపుడు ఎక్కువగా మందులు వాడటం వల్ల కూడా ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. ఎక్కువగా ఆల్కహాల్ సేవించడం ద్వారా, ప్రమాదాల్లో తలకు పెద్ద గాయమైన సందర్భంలో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని అన్నారు. మనుషులు ఎవరూ కనిపించకుండా చెవిలో మాటలు మాత్రమే వినిపించడం, తనను ఎవరో ఏదో చేయమని ఆదేశిస్తున్నట్టు భ్రమించడం ఈ వ్యాధి లక్షణాలని శ్రీనివాసరావు అన్నారు. దీర్ఘకాలికంగా మందులు వాడటం మానసిక ప్రశాంతత ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చునని శ్రీనివాసరావు తెలిపారు. కౌన్సెలింగు తప్పని సరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టర్లు కె.వర్మ, డా.శ్రావణరెడ్డి, హెచ్‌వీ నాగలక్ష్మి, హెచ్‌ఎస్ గంగాధర్, వైద్య సిబ్బంది డి. స్వర్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



అప్పనవీడులో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న పద్మావతి

పెదపాడు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రపాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు పద్మావతి తెలిపారు. మండలంలోని అప్పనవీడులో ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలలో శనివారం మాసిక మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు పద్మావతి మాట్లాడుతూ కిశోర బాలికలు అనారోగ్యం బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు పోషకాహారం తీసుకోవాలని తెలియజేశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కిశోర బాలిక దశ నుంచే పౌష్టికాహారం, ఆరోగ్య అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఆశా జ్యోతి పాఠశాల నిర్వాహకులు మాధవీలత, సీడీపీఓ విజయలక్ష్మి, అదనపు ప్రాజెక్టు అధికారి సునీల్ రాజశేఖర్, కార్యాలయ విస్తణాధికారి మల్లిక, సూపర్‌వైజర్ కుమారి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుని ఆలయ భూమి కౌలు వేలం



గుండుగొలనులో ఆలయ భూమి కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారి సృజన్, పెద్దలు

భీమడోలు: దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధీనంలోని గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి చెందిన వ్యవసాయ భూమి కౌలుకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. గుండుగొలనులోని ఆలయం వద్ద శనివారం మూడేళ్ల పాటు కౌలు చేసుకునేందుకు వీలుగా స్వామి వారికి చెందిన సర్వే నం.103లోని 4.30 ఎకరాల భూమికి కౌలుకు వేలం నిర్వహించారు. గతంలో కన్నా రూ.22వేల ఆదాయం పెరిగింది. ఏలూరు తనిఖీ అధికారి సుజన్ పర్యవేక్షణలో ఆలయ ట్రస్టీ కమిటీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి, పెద్దలు అచ్యుత రామారావు, భక్తులు ఆధ్వర్యంలో వేలం చేపట్టారు. సార్వా, దాళ్వా పంటలకు ఏడాదికి రైతులు రూ.2.56 లక్షలకు వేలం దక్కించుకున్నారు. గతంలో ఏడాదికి రూ.2.34 లక్షలు కౌలు ద్వారా ఆదాయం వచ్చింది. గతంలో కన్నా రూ.22వేల ఆదాయం పెరిగింది. ఈ కార్యక్రమంలో ఈవో కేఎం వంశీ, రైతులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు







హనుమజ్జయింతి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల ప్రతిమలు, మండపాలు

పెదపాడు: అప్పనవీడులో హనుమజ్జయింతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ వద్ద విద్యుత్ దీపాలతో దేవుళ్ల ప్రతిమలు స్వాగత మండపాలు ఏర్పాటు చేసారు. హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరాధ్య దైవమైన ఆంజనేయస్వామి ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేసారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున చలువ పందిళ్ల వేసి భక్తుల దర్శనార్థం క్యూ లైన్లు ఏర్పాటు చేసారు. ఆలయ ప్రాంగణ మంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేదు



భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ బీబీ రవికుమార్, పక్కనే ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భీమడోలు సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలు, కౌంటింగ్ ప్రక్రియ, విజయోత్సవ ర్యాలీల నిషిద్ధమని వివరించారు. సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, 144 సెక్షన్‌ను పగడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటలకు పాల్పడకుండా, పోలీస్ శాఖ అప్రమత్తతతో ఉంటూ సమస్యాత్మక, అతిసమస్మాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎటువంటి ర్యాలీలకు అనుమతులు లేవని, రాజకీయ పార్టీల నేతలు విజయోత్సవ వేడుకల్లో భాగంగా బాణసంచా కాల్చడం, మోటార్ సైకిళ్ల సైలెన్సర్ తీసి నడవడం నిషిద్ధమన్నారు. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ నాయకులకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. గ్రామాల్లో అన్ని పార్టీల నాయకులు సంశయనం పాటించాలన్నారు. రెండు మండలాల్లో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించామని, పెట్రోలు బంకుల వద్ద లూజు పెట్రోలు విక్రయాలను నిలిపివేసామన్నారు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ పద్మావతి

ఏలూరు (టూటౌన్): కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ పీడీ కేఏవీఎల్ పద్మావతి అన్నారు. ఈ నెల 21 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న మాసిక మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు సెక్టార్ ఒకటి పరిధిలోని టైటస్ నగర్ యూహెచ్‌సీలో శనివారం కిషోర బాలికలకు మెన్‌స్ట్రుయల్ హైజీన్ సంబంధించిన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ పీడీ పద్మావతి పాల్గొని మాట్లాడారు. కిషోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, రుతుక్రమం, ఆరోగ్య పరిస్థితులను వివరించారు. రుతు క్రమంపై అపోహాలు, నిషేధాలు వాడే ఉత్పత్తులు గురించి అవగాహన కల్పించారు. కిషోర బాలికలకు సరైన పౌష్టికాహారం అందకపోతే రక్త హీనత, శరీర ఎదుగుదలలో ఆటంకాలు వంటివి సమస్యలు ఏర్పడతాయన్నారు. యూహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయి నిఖిత మాట్లాడుతూ కిషోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, యూహెచ్‌సీ సిబ్బంది, కిషోర బాలికలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జీతభత్యాలు ఇప్పించాలి

ఏలూరు (టూటౌన్): ఇటీవల సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించిన జిల్లాలోని మున్సిపల్ కార్మికులకు ఎన్నికల భత్యాలు ఇప్పించాల్సిందిగా ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు జిల్లా కమిటీ శనివారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం అందజేసింది. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలలోని మున్సిపల్ కార్మికులు ఇటీవల జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 13, 14 తేదీల్లో వందలాది మంది మున్సిపల్ కార్మికులు ఎన్నికల విధులు నిర్వహించారని పేర్కొంది. పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, బల్లల ఏర్పాటు, ఈవీఎం బాక్సుల తరలింపు, సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచడం వంటి విధులను 13న ఉదయం ఐదు గంటల నుంచి 14వ తేదీ ఉదయం 5 గంటల వరకు ఏకదాటిగా నిర్వహించారని తెలిపారు. రెవెన్యూ, సచివాలయ, మున్సిపల్ సిబ్బందికి, టీచర్లకు ఎన్నికల భత్యం చెల్లించి, మున్సిపల్ కార్మికులకు మాత్రమే చెల్లించకపోవడం తగదని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ పరిశీలించి మున్సిపల్ కార్మికులకు రావాల్సిన ఎన్నికల భత్యం వెంటనే ఇప్పించాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు కోరారు.

ఏపీటీఎఫ్ 1938 నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నంబాబు, మోహనరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం నిర్వహించారు. స్థానిక పవర్‌పేట యూపీ పాఠశాలలో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గంధం రాంబాబు అధ్యక్షతన జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడిగా పి.రత్నంబాబు, ప్రధాన కార్యదర్శిగా జి.మోహనరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గంధం రాంబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఇ.రామ్మోహనరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా జి.రాజు, ఉపాధ్యక్షులుగా ఆర్‌డీవీ ప్రసాదరావు, ఎం రమేష్‌బాబు, ఎస్‌వీ దుర్గారావు, డి.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా జి.అప్పారావు, ఎం కృష్ణమూర్తి, జి.వెంకట రమణ, బి.రామదాసు, పి.రాహుల్, పి.విజయరత్నం, బి.కృష్ణవేణి, రాష్ట్ర కౌన్సిలర్లుగా పి.రత్నంబాబు, జి.మోహనరావు, జి.కృష్ణ, ఇ.రామ్మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు వ్యవహరించారు.

వేసవి శిబిరంలో ఉత్సాహంగా బాలలు



ఏలూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలబాలికలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో బాలలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నీతి కథలు చెప్పడం, దేశభక్తి గీతాలు పాడించడం, బాలలతో కథలు చెప్పించడం, వివిధ క్రీడలు ఆడించడం విద్యార్థులను ఈ శిబిరానికి వచ్చేలా చేస్తున్నాయి. బాలలతో వివిధ గృహాలంకరణ వస్తువులు తయారు చేయించడం, జ్ఞాపకశక్తిని పంపొందించే వివిధ పద్ధతులపై అవగాహన కలిగిస్తూ రీసోర్స్ పర్సన్లు శిబిరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో రీసోర్స్ పర్సన్లు డి.శ్రీవల్లి, జి.కళ్యాణి, టి.నళిని, కె.మహీధర్, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి దుర్గా ప్రసాద్ తదితరులు వివిధ అంశాలపై బాలలకు శిక్షణ అందిస్తున్నారు. ఉప గ్రంథపాలకుడు ఎ.నారాయణరావు పర్యవేక్షణలో నిర్వహిస్తోన్న ఈ శిబిరంలో గ్రంథాలయ సిబ్బంది వీటీ సందీప్, ఎండీ అస్లాం పాషా, ఎం కనకదుర్గ, బాలలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కడెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పోలవరం రూరల్: గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పోలవరం గ్రామస్తులు, రైతులు గ్రామ దేవత కడెమ్మ తల్లికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మవారిని గ్రామంలోని నడిబొడ్డు వద్ద ఏర్పాటు చేసిన పూరిపాకలో నెలకొల్పారు. 10 రోజులపాటు అమ్మవారిని గ్రామంలో ఉంచి, పూజలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారిని ఆలయానికి సాగనంపుతారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించుకుంటారు.

వృత్తి విద్యా కోర్సులు ఎప్పటికీ ఉపాధి మార్గాలే

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య చేతుల మీదుగా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అద్దయ్య మాట్లాడుతూ విద్యాభ్యాసాన్ని ఒక తపస్సులా భావించిన రోజున, వయసుతో సంబంధం లేకుండా విజయం వరిస్తుందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో నేర్చుకునే వృత్తి విద్యా కోర్సులు ఎప్పటికీ ఉపాధి మార్గాలే అన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే ఉద్యోగాలు సాధించడం శుభపరిణామమని అన్నారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ నుంచి ఐదుగురు, మెకానికల్ ఇంజినీరింగ్ నుంచి ఐదుగురు విద్యార్థులు ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు సాధించారని వివరించారు. వీరందరికీ శనివారం నియామకపత్రాలు అందజేశామన్నారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు కళాశాలలో అందిస్తున్నామని, కళాశాలలో సంప్రదించాలని కోరారు.